## గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను

# జయప్రదం చేయాలి: భూక్యా వీరభద్రం



**కారేపల్లి, కెరటం న్యూస్**

ఖమ్మం కేంద్రంగా గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఐటీడీఏను ఏర్పాటు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం తదితర మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడానికి ఐటీడీఏ ఏర్పాటు ఎంతో అవసరమని అన్నారు. కారేపల్లి మండల కేంద్రంలోని భాగం రామ నరసయ్య భవన్‌లో శనివారం తెలంగాణ గిరిజన సంఘం మండల కమిటీ విస్తృత సమావేశం మండల అధ్యక్షులు అజ్మీరా శోభన్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో భూక్యా వీరభద్రం పాల్గొని మాట్లాడారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ మహాసభల పోస్టర్‌ను గిరిజన సంఘం నాయకులతో కలిసి సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు భూక్యా రంజిత్ నాయక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. మండల పరిధిలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించేందుకు గిరిజన సంఘం ఆధ్వర్యంలో సర్వేలు నిర్వహించి, తండా కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1న మండల మహాసభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల మహాసభను, రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయడానికి గిరిజనులు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కారేపల్లి మండల కేంద్రంలో 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని మంజూరు చేసి, మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో తెలంగాణ గిరిజన సంఘం మండల కార్యదర్శి, ఉసిరికాయలపల్లి మాజీ సర్పంచ్ బానోతు బన్సీలాల్ నాయక్, మండల నాయకులు మాలోతు బాలు నాయక్, బానోతు శ్రీనివాస్ నాయక్, భూక్యా రాంబాబు నాయక్, భూక్యా రమేష్, అజ్మీరా శ్రీను, బానోతు కిషన్ నాయక్, ధర్మశోత్ సూర్య నాయక్, భూక్యా పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కతోనే మానవాళికి మనుగడ

# బ్రదర్ సంతోష్



**చింతకాని, కెరటం న్యూస్ ప్రతినిధి**

ప్రపంచ మానవాళి మనుగడ ముందుకు సాగాలంటే తప్పకుండా ప్రతి ఒక్కరూ ఒక మొక్కనాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని చింతకాని మండలం రామకృష్ణాపురం సెయింట్ థెరిసా హై స్కూలు ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ అన్నారు. శనివారం సెయింట్ థెరిసా హైస్కూల్‌లో పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రదర్ సంతోష్ మాట్లాడుతూ పచ్చదనాన్ని మరింత పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని బ్రదర్ కోరారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు. పాఠశాలల్లో నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సెయింట్ థెరిసా హై స్కూల్‌లో మొక్కలు నాటిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆ మొక్కలు పెరిగి పెద్ద అయ్యేలా కృషిచేయాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో అసమతుల్యత ఏర్పడి, పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ఏర్పడటానికి కారణం వాతావరణంలో మార్పులు రావడమే కారణమని బ్రదర్ సంతోష్ గుర్తుచేశారు. ప్రధానంగా వాతావరణంలో అసమతుల్యత కారణంగానే అతివృష్టి, అనావృష్టి, అత్యధిక ఎండలు, అతిశీతల పరిస్థితులు లాంటి అసాధారణ పరిస్థితులను మానవాళి ఎదుర్కొంటున్నదని అన్నారు. భూకంపాలు, జలప్రళయాలు, తదితర అసాధారణ పరిస్థితులకు కారణం కేవలం వాతావరణంలో ఏర్పడిన భూతాపం మాత్రమేనని అన్నారు. ఇలాంటి పరిస్థితులను మళ్లీ సాధారణ పరిస్థితులకు తీసుకురావడానికి మనకున్న ఒకేఒక్క మార్గం మొక్కలు నాటడమేనని బ్రదర్ సంతోష్ అన్నారు.

**మొక్కలు నాటిన సెయింట్ థెరిసా స్టాఫ్, విద్యార్థులు**

సెయింట్ థెరిసా స్టాఫ్ హైస్కూల్‌లో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. స్కూలు ప్రాంగణంలోని వివిధ ప్రాంతాల్లో పూలమొక్కలు, పండ్ల మొక్కలు, టేకు, వేపచెట్లు, తదితర నీడనిచ్చే చెట్లను నాటారు. ఈ కార్యక్రమంలో సెయింట్ థెరిసా హై స్కూల్ మేనేజర్ బ్రదర్ స్టీఫెన్, వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ జోషి, బ్రదర్ అనూప్‌థామస్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



## గణేష్ నిమజ్జనం పాయింట్‌కు

# చేరుకునే మార్గాలు




**వనం నాగయ్య, కెరటం న్యూస్**

1) రూరల్ మండలం నుంచి మరియు రాపర్తి నగర్,బీసీ కాలనీ, కూరగాయల మార్కెట్, ఆర్ఆర్ స్కూల్ ఏరియా, కొత్త బస్టాండ్ ఏరియా, సాయిబాబా ఆర్చ్, ఆర్టిఏ ఆఫీస్ ఏరియా, బ్యాంక్ కాలనీ, వికలాంగుల కాలనీ, బల్లేపల్లి,ఖానాపురం టేకులపల్లి,న్యూ విజన్ కాలేజ్ వైపు నుండి వచ్చే గణేష్ విగ్రహాలు బైపాస్ ద్వారా ఎన్టీఆర్ సర్కిల్ కి చేరుకొని అక్కడి నుండి ఇల్లందు ఎక్స్ రోడ్, గవర్నమెంట్ హాస్పిటల్ జడ్పీ సెంటర్,చెరువు బజార్ బోనకల్ ఎక్స్ రోడ్, చర్చి కాంపౌండ్, ముస్తాఫ్ నగర్ సంబానినగర్, రాఘవ మెడికల్స్, శ్రీరామ్ హిల్స్, దంసలాపురం చెరువుకి వెళ్లేదారి గుండా నిమజ్జనం పాయింట్ కి చేరుకోవాలి.

2) పంపింగ్ వెల్ రోడ్, గాంధీనగర్, మోతీనగర్, పిఎస్ఆర్ రోడ్, గాంధీచౌక్ సారధినగర్, బొక్కలగడ్డ నుండి వచ్చే వాహనాలు నయాబజార్ నుండి జూబ్లీ క్లబ్ మయూరి సెంటర్, మామిళ్లగూడెం, బురాన్ పురం, బస్ డిపో ఏరియా, కమాన్ బజార్, కస్బా బజార్ నుండి వచ్చే వాహనాలు కిన్నెరసెంటర్, జడ్పీ సెంటర్, చెరువు బజార్, చర్చి కాంపౌండ్ మీదుగా నిమజ్జనం పాయింట్ కు చేరుకోవాలి.

3) శ్రీ శ్రీ, సర్కిల్, శ్రీ నగర్ కాలనీ, రోటరీ నగర్, ఇందిరానగర్, పాత మమతా మెడికల్ కాలేజీ, మమత ఎక్స్ రోడ్, కవి రాజు నగర్, పాత కలెక్టరేట్ బ్యాక్ గల విగ్రహాలు....గట్టయ్య సెంటర్, బ్యాంక్ కాలని,వీడియోస్ కాలనీ నుండి వచ్చే వాహనాలు ఇల్లందు ఎక్స్ రోడ్డు నుండి జడ్పీ కి చేరుకొని చర్చి కాంపౌండ్ ద్వారా నిమజ్జనం పాయింట్ కి చేరుకోవాలి.

4) వెంకటగిరి ఎక్స్ రోడ్, శ్రీనివాస నగర్, గ్రేయిన్ మార్కెట్ ఏరియా, ప్రకాష్ నగర్, గుట్టల బజార్, జహీర్ పుర తండా అయ్యప్ప స్వామి టెంపుల్ ఏరియా విగ్రహాలు మొత్తం మెయిన్ రోడ్డు ద్వారా చర్చి కాంపౌండ్ కి చేరుకొని అక్కడి నుండి నిమజ్జనం పాయింట్ కి చేరుకోవాలి.

5) గొల్లగూడెం మధురానగర్ రాఘవయ్య నగర్ మమతా కాలేజ్, హార్వెస్ట్ స్కూల్ ఏరియా, అల్లిపురం, కొత్తగూడెం, అల్లిపురం ఎక్స్ రోడ్డు నుండి వచ్చే విగ్రహాలు టాటా మోటార్స్ ద్వారా చెరువు బజార్, చర్చి కాంపౌండ్ ద్వారా నిమజ్జనం పాయింట్ కు చేరుకోవాలి.

6) బోనకల్ ఎక్స్ రోడ్, చర్చి కాంపౌండ్, పోలీస్ హెడ్ క్వార్టర్స్, మిషన్ హాస్పిటల్ ఏరియా, ముస్తఫా నగర్, సంబాని నగర్, పరికముక్కల కాలనీ, శ్రీరామ్ నగర్, శ్రీరామ్ హిల్స్ నుండి వచ్చే విగ్రహాలు మెయిన్ రోడ్డు ఎక్కి నిమజ్జనం పాయింట్ కు చేరుకోవాలి.

**తిరుగు ప్రయాణం**

7) నిమజ్జనం అనంతరం ప్రజలు మరియు వాహనాలు నిమజ్జనం పాయింట్ నుండి జయశంకర్ విగ్రహం వరకు చేరుకొని ప్రకాష్ నగర్, శ్రీనివాస్ నగర్, జహీర్ పుర తండా, అయ్యప్ప టెంపుల్, వెంకటగిరి ఎక్స్ రోడ్ వైపు వెళ్లేవారు దంసలాపురం బ్రిడ్జిని దాటి బ్రిడ్జి కింది నుండి దంసలాపురం ఊర్లో నుండి ఎస్వీఎం స్కూల్ గుండా శ్రీనివాస నగర్, అయ్యప్ప టెంపుల్, ప్రకాష్ నగర్ వైపు వెళ్లి మెయిన్ రోడ్డు ద్వారా వారి గమ్యస్థానాలకు వెళ్ళవచ్చును.

8) ముస్తఫా నగర్, మమతా రోడ్, ఇల్లందు ఎక్స్ రోడ్, ఎన్టీఆర్, బల్లేపల్లి మామిళ్లగూడెం, న్యూ బస్టాండ్ రాపర్తి నగర్, రూరల్ వైపు వెళ్లేవారు జయశంకర్ విగ్రహం దగ్గర నుండి శ్రీరామ్ హిల్స్, రాఘవ మెడికల్స్ దగ్గర రోడ్ క్రాస్ చేసి పరికముక్కల కాలనీ ద్వారా అల్లిపురం ఎక్స్ రోడ్డుకు చేరుకొని అక్కడి నుండి టాటామోటార్స్, లకారం, మమత ఎక్స్ రోడ్డుకు చేరుకొని ఇందిరానగర్, శ్రీశ్రీ ద్వారా బైపాస్ కు చేరుకొని వారి గమ్యస్థానాలకు వెళ్ళవచ్చు.

9)వినాయక నిమజ్జనం అనంతరం బయటకు వెళ్లే దారులను కేవలం వన్ వే ట్రాఫిక్ మాత్రమే అనుమతించబడును కావున ప్రజలందరూ ఇట్టి విషయాన్ని గమనించి ట్రాఫిక్ పోలీస్ వారికి సహకరించగలరు.

# కెరటం న్యూస్ ప్రత్యేకం